## 14 నుంచి యాదగిరిగుట్టలో పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 6: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఈ నెల 14న ప్రారంభం కానున్నాయి. ప్రధానాలయంలోని వెలుపలి ప్రాకారం అద్దాల మండపంలో శ్రావణ శుద్ధ దశమి బుధవారం రోజున పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ ఉత్సవాలు 15, 16 వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా రెండ్రోజులు ఆర్జిత పూజలను రద్దు చేయనున్నారు. భక్తులతో చేసే నిత్య, శాశ్వత తిరుకల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం రద్దు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 17 నుంచి యదావిధిగా స్వామివారి నిత్య కైంకర్యాలు నిర్వహిస్తారు. ప్రతియేటా శ్రావణ మాసంలో సర్వదోషాలు తొలగిపోవడానికి ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.. నాలుగు చతుర్వేద పారాయణాలు, మూల మంత్ర హవనాలు జరిపిస్తారు. ఈ పూజల్లో 108 రకాల నూలు పోగులకు ప్రత్యేక పూజలు, వేదమంత్ర పఠనాల మధ్య పవిత్రాలను తయారు చేస్తారు.


నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, బుధవారం 7 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI




జలాల్‌పూర్‌లో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లోకేశ్‌కుమార్

## పచ్చదనం.. పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

- సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లోకేశ్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 6 : రాష్ట్రంలో 6 కోట్ల మొక్కలు నాటాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ లోకేశ్‌కుమార్ అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో లేక్ వ్యూ పార్క్, స్వామి రామానంద గ్రామీణ సంస్థ, గ్రామ పంచాయతీని ఆయన మంగళవారం సందర్శించారు. రామానంద సంస్థలో పలు శిక్షణ కోర్సుల వివరాలు తెలుసుకున్నారు. నర్సరీ నిర్వహణ, ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. మహిళా సంఘాల నిర్వహణ, పొదుపు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వం చేయూత వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 67 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఒక కోటి సంఘాలు చేయాలనేది లక్ష్యమని తెలిపారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో మహిళా సంఘాలతోపాటు ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేసి విజయవంతం చేయాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తాగునీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని చెప్పారు. గ్రామ అభివృద్ధి కోసం సర్పంచులు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, చేసిన పనులకు బిల్లులు రాష్ట్రంలో రూ.146 కోట్లు ఉన్నాయని, వాటికి నిధులు విడుదల చేస్తామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్లలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, రామానంద సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి, మండల వైద్యాధికారిని శ్రీదేవి, డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, మజీద్, నీరజ, గుత్తా వెంకట్‌రెడ్డి, కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం జలాలు అందేనా?

నాడు భూమికి పచ్చని రంగేసినట్లు పొలాలు.. అంతటా జల సవ్వడులు.. నిండు కుండలా చెరువులు.. కానీ ఏడాది తిరుగకముందే సీన్ రివర్స్ అయ్యింది. బీళ్లుగా మారిన భూములు.. ఒట్టిపోయిన బావులు.. అడుగంటిన భూగర్భ జలాలు.. చుక్క నీరు లేని చెరువులు.. జిల్లాలో ఒక్కసారిగా పరిస్థితి మారింది. సాగు నీటికి, రైతన్నకు కష్టాలు మొదలయ్యాయి. కాళేశ్వరం జలాలు ఎప్పుడొస్తాయా అని ఆశగా అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ)

## నాడు పచ్చని మాగాణం.. నేడు బీడుగా భూములు

- గోదావరి జలాలు అందక అవస్థలు
- పలు మండలాల్లో సాగు నీటికి కష్టాలు
- సాగుకు రైతన్నల వెనుకడుగు
- ఎండిన చెరువులు.. అడుగంటిన భూగర్భ జలాలు
- వర్షాలూ అంతంతే.. కొత్త బోర్ల వైపు బాటలు
- కాళేశ్వరం జలాల కోసం ఆశగా ఎదురుచూపు



మోత్కూరులో సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలం

### నాడు.. నేడు..

ఈ ఏడాది రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో పలు మండలాల్లో కాళేశ్వరం జలాలు పరవళ్లు తొక్కాయి. ముఖ్యంగా గుండాల, అడ్డగూడూరు, మోత్కూరు, బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో పలు గ్రామాలకు కాళేశ్వరం జలాలు అందేవి. తుర్కపల్లి మీదుగా వచ్చిన జలాలు భువనగిరి మండలంలోని చెరువుల్లోకి చేరేవి. దాంతో చెరువులు, కాల్వల్లోకి పుష్కలంగా నీరు వచ్చి చేరేది. చెక్‌డ్యామ్‌లు నిండుకుండలా దర్శనమిచ్చేవి. ఫలితంగా భూగర్భ జలాలు కూడా భారీగా పెరిగాయి. రైతులకు సాగునీటికి కష్టాలు లేకపోవడంతో సంతోషంగా పంటలు సాగు చేసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు అందించడంతో రంది లేకుండా ధాన్యం పండించి లాభాలు గడించారు. కానీ ఈ సారి పరిస్థితి తారుమారైంది. కాళేశ్వరం జలాలు ఇంకా జిల్లాను తాకలేదు. నీళ్లు అందించేందుకు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. కాళేశ్వరం జలాలు వస్తే నీటి సమస్య తీరుతుందని చెప్తున్నారు.

### వట్టిపోతున్న బోర్లు..

ఈ ఏడాది భూగర్భ జలాలు భారీగా అడుగంటాయి. గతేడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది 6.16 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. గతేడాది జూలైలో 4.7 మీటర్ల లోతులోనే ఉండగా, ఈ సారి ఏకంగా 10.90 మీటర్ల లోతులోకి ఇంకిపోయాయి. సంస్థాన్ నారాయణపురంలో 18.58 మీటర్లలోతులో నీళ్లు ఉన్నాయి. బొమ్మలరామారంలో 14.29, తుర్కపల్లిలో 13.08, మోత్కూరులో 12.06, భువనగిరిలో 11.28, యాదగిరిగుట్టలో 11.05, గుండాలలో 8.86 మీటర్ల కింద భూగర్భ జలాలు ఉన్నాయి. మరోవైపు గ్రౌండ్ వాటర్ లేకపోవడంతో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. చేసేదేం లేక కొంత మంది రైతులు మళ్లీ కొత్త బోర్లు వేస్తున్నారు. లక్షలు ఖర్చు పెట్టి పొలాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### సాగుకు వెనుకంజ..

వానకాలం సీజన్‌కు సంబంధించి సాగు పనులు నెమ్మదిగా నడుస్తున్నాయి. వర్షాలు లేక, సాగు నీరు అందక పొలం పనులు ముందుకు సాగడంలేదు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,59,850 ఎకరాల్లో సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే అనేక చోట్ల రైతులు నారుమడులు దున్నుకొన్నారు. కానీ నీటి వనరులు లేకపోవడంతో వరి నాట్లు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని చోట్ల వరినాట్లు పెట్టినా సరిపడా నీళ్లు లేక ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి. మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు, తుర్కపల్లి మండలాల్లో సాగుకు తిప్పలు తప్పడం లేదు. మరో రెండు వారాలు ఇదే పరిస్థితి కొనసాగితే దారుణంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక మరికొందరు భూములు సాగు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎకరం ఉన్నోళ్లు, అర ఎకరమే సాగు చేస్తున్నారు. కాలం కలిసిరానప్పుడు పెట్టుబడి పెట్టి.. ఇబ్బందులు పడటం ఎందుకనే ధోరణిలో ఉన్నారు. ఇక పత్తి రైతులకు మాత్రం అడపదడపా కురుస్తున్న వర్షాలతో కాస్త ఉపశమనం లభిస్తున్నదని చెప్పవచ్చు.

### చెరువుల్లో చుక్క నీరు లేకపాయె..

ఈ ఏడాది వర్షాలు సైతం అంతంత మాత్రంగానే కురుస్తున్నాయి. భారీ వర్షాలు అన్న ముచ్చటే లేదు. ఓ వారం రోజులు ముసురుతో మురిపించి పోయింది. గతేడాది జూలై వరకు 68శాతం అధికంగా వర్షాలు కురిస్తే.. ఈ సారి ఏకంగా మైనస్ నాలుగు శాతం వర్షపాతం నమోదవడం గమనార్హం. ఇక మరోవైపు చెరువుల్లో చుక్క నీరూ లేదు. జిల్లాలో 803 చెరువులకుగానూ 428 చెరువుల్లో మాత్రమే 25శాతం లోపు నీళ్లు ఉన్నాయి. 205 చెరువుల్లో 25 శాతం నుంచి 50శాతం వరకు, 68చెరువుల్లో 50 నుంచి 75శాతం వరకు, 40శాతం చెరువుల్లో 100శాతం నీళ్లు ఉన్నాయి.

### చెరువులోకి నీరు వదలాలి



సంవత్సర కాలంగా వర్షాలు సరిగ్గా కురువక పోయినా నాకున్న బోరు ఆధారంగా రెండెకరాల్లో వరినాటు పెట్టాను. ఈసారైనా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశతో పంట సాగు చేశా. మొన్నటి దాకా కొద్దో గొప్పో బోరు నుంచి నీళ్లు వచ్చేవి. ఆగస్టు నెల వచ్చిన ఇంతవరకు వర్షాలు మంచిగా కురవలేదు. చెరువులో నీళ్లు లేకపోవడంతో భూగర్భ జల మట్టం పడిపోతున్నది. బోరు నుంచి నీళ్లు రావడం తగ్గిపోయింది. వర్షాలు కురువకపోతే వారంలో నా పొలం మొత్తం ఎండిపోతుంది. ప్రభుత్వం కొండ పోచమ్మ ప్రాజెక్ట్ ద్వారా శామీర్‌పేట వాగులోకి, చెరువులోకి నీళ్లు వదిలితే భూగర్భజలాలు పెరుగుతాయి. రైతులు పంట నష్టపోకుండా ఉంటారు.

- ఎల్లబోయిన శ్రీనివాస్, రైతు, బొమ్మలరామారం



గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

## మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి

- రికార్డులు సక్రమంగా నిర్వహించాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

గుండాల, ఆగస్టు 6 : పరిశుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని మాసాన్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అంతకు ముందు మొక్కలు నాటారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. వారంలోగా నర్సరీలో ఉన్న మొక్కలను గ్రామంలో నాటాలని ఏపీఎం ఇమ్మానియేల్, పంచాయతీ కార్యదర్శి బాలలక్ష్మిని ఆదేశించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణుల డెలివరీ వివరాలు రికార్డులో నమోదు చేయకపోవడంతో ఆయన పీహెచ్‌ఎన్ వనజ కుమారిపై అసహనం వ్యక్తం చేశారు. రోగులకు చేస్తున్న టెస్టుల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్ రేఖను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి గూడ వెంకటేశ్వర్లు, తాసీల్దార్ జల కుమారి, ఇన్‌చార్జి ఎంపీఓ ధనుంజయ్, ఆర్ఐ నరేశ్, సీహెచ్ఓ వెంకటేశం, సూపర్ వైజర్ కరుణ, స్టాఫ్ నర్సులు సుజాత, పార్వతి, ల్యాబ్ టెక్నీషియన్ రేఖ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఉన్నారు.





రామన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదుట ఆందోళన చేస్తున్న మానస కుటుంబ సభ్యులు

## ప్రభుత్వ దవాఖానలో బాలింత మృతి

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబం ఆందోళన
- రామన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఘటన



కొల్లు మానస (ఫైల్)

రామన్నపేట, ఆగస్ట్ 6 : రామన్నపేట ప్రభుత్వ దవాఖానలో బాలింత మృతిచెందగా, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన కొల్లు మహేశ్, మానస(26)కు నాలుగేండ్ల క్రితం పెండ్లి జరిగింది. వీరికి మూడేండ్ల పాప ఉంది. రెండోసారి గర్భం దాల్చిన మానస రామన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకుంటూ మందులు వాడుతున్నది. ఈ నెల 4న కాన్పు కోసం అదే ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. 5వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు వైద్యులు ఆపరేషన్ చేయగా, ఆడబిడ్డ పుట్టింది. సాయంత్రం నుంచి మానసకు విపరీతంగా రక్తస్రావం అవడంతోపాటు బీపీ పడిపోయి సీరియస్ అయ్యింది. దాంతో రాత్రి అంబులెన్స్‌లో నల్లగొండ జిల్లా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి మానస మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు అదేరాత్రి మానస మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చారు. డాక్టర్ల నిర్లక్ష్యమే మానస మృతికి కారణమంటూ మృతదేహాన్ని దవాఖాన ప్రధాన ద్వారం వద్ద ఉంచి మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు. మానస మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ వచ్చి న్యాయం చేసే వరకు ఆందోళన విరమించబోమని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ చిన్నూనాయక్, తాసీల్దార్ లాల్‌బహదూర్ దవాఖానకు చేరుకొని బాధిత కుటుంబంతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బందిని విచారించారు. మానస మృతిపై విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదికను అందిస్తామని తెలిపారు. న్యాయం చేస్తామని నచ్చజెప్పి హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

## చేనేతలో యువ కళాకారుడి ప్రతిభ

- ఉన్నత చదువులు చదివి కులవృత్తిపై ఆసక్తి
- సహజసిద్ధ రంగులు, వంద డిజైన్లతో చీరె తయారీ
- నేడు కేంద్ర చేనేత, జౌళి శాఖ నుంచి పురస్కారం అందుకోనున్న ముఖేశ్



మగ్గంపై చీరె నేస్తున్న ముఖేశ్



జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన చీరె ఇదే..

చౌటుప్పల్, ఆగస్టు 6: ఉన్నత చదువులు చదివినా మూలాలను మరువకుండా కులవృత్తిలో కొత్తదనం కోసం శ్రమించి జాతీయ స్థాయిలో మెరిశాడు ఈ యువ చేనేత కళాకారుడు. సహజ సిద్ధ రంగులు ఉపయోగించి, తక్కువ బరువు, ఎక్కువ డిజైన్లతో చీరె నేసి కేంద్ర పురస్కారానికి ఎంపికయ్యాడు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కర్నాటి ముఖేశ్ బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశాడు. ఓ వైపు చదువుకుంటూ మరోవైపు కులవృత్తిలో ప్రయోగాలు చేసేవాడు. చదవు ముగిసినా ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా చేనేతనే ప్రధాన వృత్తిగా ఎంచుకుని పదిహేనేండ్లుగా అద్భుతాలు సృష్టిస్తున్నాడు. ఈ క్రమంలోనే సహజ సిద్ధమైన రంగులతో చీరె నేసి జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు. చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర, చేనేత జౌళి శాఖ జాతీయ స్థాయిలో 14 మందిని కళాకారులను పురస్కారానికి ఎంపిక చేయగా తెలంగాణ నుంచి ముఖేశ్ ఒకరు మాత్రమే ఎంపికయ్యాడు. రాష్ట్రంలో 27 మంది దరఖాస్తు చేసుకోగా ఆయనకు మాత్రమే గుర్తింపు దక్కింది. బుధవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ముఖేశ్ పురస్కారం అందుకోనున్నాడు.

### చీరె తయారీ ఇలా...

చీరె తయారీకి ముఖేశ్ సన్నటి నూలు దారం ఉపయోగించాడు. ప్రకృతి సిద్ధమైన రంగులు వాడడంతో పాటు ఆయుర్వేద గుణాలున్న కరక్కాయ పొడి, కుంకుడుకాయ రసంతో శుద్ధి చేశాడు. ముగ్గంపై పడుగు, పేక ఒక్కో పోగును అల్లుతూ రెండేండ్లు శ్రమించి చీరెను సిద్ధం చేశాడు. 46 అంగుళాల వెడల్పు, ఏడు మీటర్ల పొడవుతో 600 గ్రాముల తేలికైన చీరెను నేశాడు. అందులో పూల మొగ్గలు, విరబూసిన పువ్వులు, సూర్యుడు, చందమామ, స్వస్తిక్, విక్టరీ సింబల్, క్యారమ్ బోర్డు వంటి దాదాపు 100 రకాల డిజైన్లు వేశాడు.

### ఇష్టంగా చేస్తేనే ఫలితం

నేను బీటెక్ చేసినా ఉద్యోగావకాశాల కోసం వెతుకలేదు. కులవృత్తిలోనే ప్రత్యేకత చాటాలనుకున్నా. ఉన్న ఊరిలో పది మందికి ఉపాధి చూపించాలనుకున్నా. అందుకోసం చేనేతలోనే కొనసాగుతున్నా. నేటి యువత చేనేత వృత్తిలోకి రావడానికి ఆసక్తి చూపడడం లేదు. ఏ వృత్తినైనా కష్టంతో కాకుండా ఇష్టంగా చేస్తే ఫలితం ఉంటుంది.

-కర్నాటి ముఖేశ్, చేనేత కళాకారుడు

## ఎర్త్ డ్యామ్ వద్దకు లాంచీ స్టేషన్

నందికొండ, ఆగస్టు 6 : నందికొండ హిల్‌కాలనీ విజయవిహార్ వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన లాంచీ స్టేషన్‌ను గతంలో ఎర్త్ డ్యామ్ సమీపంలో నిర్వహించిన స్థలానికి మార్చినట్లు లాంచీస్టేషన్ అధికారులు తెలిపారు. ఇప్పటి నుంచి లాంచీలు ఎర్త్ డ్యామ్ సమీపంలోని లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు జాలీ ట్రిప్పులు నడుపుతామని, కృష్ణానదిలో 560 అడుగులు వరకు నీరు ఉన్నంత వరకు ఇక్కడి నుంచి లాంచీలను నడుపవచ్చని చెప్పారు.



ఎర్త్ డ్యామ్ వద్ద లాంచీలు



ఇంద్రధనస్సు చీరెను మగ్గంపై నేస్తున్న గడ్డం బాలయ్య

## గడ్డం బాలయ్యకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 6 : చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు గడ్డం బాలయ్య రాష్ట్రస్థాయి కొండా లక్ష్మణ్ బాపూజీ హ్యాండ్లూమ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు చేనేత జౌళి శాఖ అధికారులు మంగళవారం గడ్డం బాలయ్యకు సమాచారం అందజేశారు. ప్రకృతి రంగులతో ఇక్కత్ డిజైన్‌లో నాలుగు నెలల పాటు శ్రమించి తయారు చేసిన ఇంద్ర ధనుస్సు చీరెకు ఈ అవార్డు దక్కింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న హైదరాబాద్‌లో ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నారు. బాలయ్యకు అవార్డు రావడం పట్ల పలువురు గ్రామస్తులు ఆయనను అభినందించారు.


నమస్తే తెలంగాణ

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.

సెల్: 9182777625

నల్లగొండ : 9182 777 635
సూర్యాపేట : 9182 777 630
మిర్యాలగూడ : 9182 777 059
యాదాద్రి భువనగిరి : 9182 777 638
కోదాడ : 9182 777 059
హుజూర్‌నగర్ : 9182 777 059
హాలియా : 9182 777 059
దేవరకొండ : 9182 777 635
చౌటుప్పల్ : 9182 777 638